చేనేత గుర్తింపునకు కృషి చేయండి

ప్రధాని మోదీకి అఖిల భారత పద్మశాలి సంఘం లేఖ

హైదరాబాద్, అక్టోబర్18 (నమస్తే తెలంగాణ): ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ హ్యాండ్లూమ్ కోసం కృషి చేయాలని కేంద్రాన్ని అఖిల భారత పద్మశాలి సంఘం చేనేత విభాగం డిమాండ్ చేసింది. ఈ మేరకు యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీకి ప్రతిపాదనలు పంపాలని ప్రధాని మోదీకి బుధవారం చేనేత విభాగం అధ్యక్షుడు యర్రమాద వెంకన్న బహిరంగ లేఖ రాశారు. ఈ ఏడాదిని ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్ (ఐవైఎం)గా ప్రకటించినట్టుగానే ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ హ్యాండ్లూమ్ కోసం కృషి చేయాలని కోరారు. భారతదేశం గొప్ప సాంస్కృతిక వారసత్వమని, సంప్రదాయాల్లో చేనేత అంతర్భాగమని, ఈ నేపథ్యంలో చేనేతకు విశేష గుర్తింపును తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ చేనేత సంవత్సరం ప్రకటిస్తే అది చేనేత కార్మికుల నైపుణ్యం, సంప్రదాయ వస్త్రాల సంరక్షణ, ప్రపంచ వేదికపై ప్రదర్శనకు, ప్రచారానికి ఎంతో దోహదపడుతుందని లేఖలో పేర్కొన్నారు.

కాంగ్రెస్‌కు గద్వాల డీసీసీ చీఫ్ గుడ్‌బై

- అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లోకి గద్వాల డీసీసీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి
- కండువా కప్పి ఆహ్వానించిన హరీశ్
- కాంగ్రెస్, బీజేపీకి అభ్యర్థుల కరువొచ్చింది
- ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడి
- కాంగ్రెస్‌లో నోట్ల కట్టలకు టికెట్లు
- అందుకే రాజీనామా: ప్రభాకర్‌రెడ్డి
- రాహుల్ పర్యటనవేళ కాంగ్రెస్‌కు షాక్

తెలంగాణభవన్‌లో బుధవారం మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న గద్వాల డీసీసీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి. చిత్రంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ)/ గద్వాల: రాష్ట్ర కాంగ్రెస్‌కు భారీ షాక్ తగిలింది. జోగులాంబ గద్వాల డీసీసీ అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేశారు. తన అనుచరగణంతో హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో బుధవారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి మంత్రి హరీశ్‌రావు గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. బీఆర్ఎస్‌లో చేరిన ప్రభాకర్‌రెడ్డికి సముచిత స్థానాన్ని కల్పించి పార్టీ గౌరవిస్తుందని చెప్పారు. బీఆర్ఎస్‌ను తట్టుకొని నిలబడే అభ్యర్థుల కరువుతో కాంగ్రెస్, బీజేపీలు కొట్టుమిట్టాడుతున్నాయని ఎద్దేవా చేశారు. కంటి ముందు అభివృద్ధి, ఇంటి ముందు సంక్షేమం ఇవే బీఆర్ఎస్‌ను మూడోసారి అధికారంలోకి తెస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో నాలుగు ఓట్ల కోసం కాంగ్రెస్, బీజేపీ నేతలు చెప్పే మాటలను ప్రజలను నమ్మబోరని తెలిపారు. గద్వాలలో నిత్యం అందుబాటులో ఉండే ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

టికెట్లు అమ్మకాన్ని సహించలేకే: ప్రభాకర్‌రెడ్డి

నోట్ల కట్టలకు టికెట్లు అమ్ముకొనే సంస్కృతి చూడలేక తాను కాంగ్రెస్ పార్టీని వీడానని పటేల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గద్వాలకు ముఖ పరిచయం లేని వ్యక్తులకు రేవంత్‌రెడ్డి టికెట్‌ను అమ్ముకున్నారని ఆరోపించారు. 25 ఏండ్ల నుంచి కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని పార్టీ కోసం పాదయాత్ర చేస్తే తనకు సీటు ఇవ్వకుండా ప్యారాచూట్ నాయకులుగా పార్టీలోకి వచ్చిన వారికి కేటాయించడమేమిటని ప్రశ్నించారు. గద్వాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఓటమే లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు. గద్వాలలోని పటేల్ ప్రభాకర్‌రెడ్డి క్యాంప్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ జెండాలు, ఫ్లెక్సీలను ఆయన అనుచరులు దహనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర వినియోగదారుల ఫోరం చైర్మన్ గట్టు తిమ్మప్ప, జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి రాకేశ్, ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గద్వాలలో కాంగ్రెస్ ఖాళీ

కాంగ్రెస్ అధి నాయకులు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ రాష్ట్రంలో పర్యటిస్తుండగా.. మరోవైపు కీలక నేతలు పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. బుధవారం బీఆర్ఎస్‌లో చేరినవారిలో గద్వాల కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పూల కరుణాకర్, అలెగ్జాండర్, జనరల్ సెక్రటరీ విజయ్‌కుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రఘునాయుడు, ధరూర్, కేటిదొడ్డి మండలాల అధ్యక్షులు శ్రీకాంత్‌గౌడ్, విశ్వనాథ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ, కాంగ్రెస్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఉమాదేవి, కౌన్సిలర్ బంగి ప్రియాంక, ఎంఐఎం టౌన్ ప్రెసిడెంట్ బంగి సుదర్శన్ తదితరులు ఉన్నారు. గద్వాల జిల్లాలో అన్ని మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు గులాబీ కండువా కప్పుకోవటంతో జిల్లా కాంగ్రెస్ ఖాళీ అయిందనే వాదన వినిపిస్తున్నది.

లోకం పోకడ

అవునయ్యా.. మేం కరెక్టే చెప్పాం..
ఐదు రోజులకు కలిపి 24 గంటల కరెంటు ఇస్తామన్నాం!

నేడు దివ్యాంగుల కృతజ్ఞత సభ

హైదరాబాద్, అక్టోబర్18 (నమస్తే తెలంగాణ): తెలంగాణ భవన్‌లో గురువారం దివ్యాంగుల పింఛన్ లబ్ధిదారుల కృతజ్ఞత సభ జరుగుతుందని రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ సభకు మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. వికలాంగుల కోసం తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సక్షేమ ఫలాలపై ప్రత్యేకంగా రూపొందించిన పాటను ఈ సందర్భంగా విడుదల చేయనున్నారని తెలిపారు.

సీఎం కేసీఆర్‌కు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానపత్రాన్ని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డికి అందజేస్తున్న గజ్వేల్ ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు

కేసీఆర్‌కు లక్షకు పైగా మెజార్టీ ఇస్తాం

- గజ్వేల్‌లో వివిధ సంఘాల ప్రతినిధుల ప్రతిన
- గ్రామీణ వైద్యులు, పాస్టర్లు, ల్యాబ్, మెడికల్ షాప్ అసోసియేషన్ల సపోర్ట్
- యాదవరెడ్డి, వంటేరు, మాదాసుకు తీర్మానప్రతుల అందజేత

గజ్వేల్, అక్టోబర్ 18: సీఎం కేసీఆర్‌కు గజ్వేల్ నియోజకవర్గంలో లక్షకు పైగా ఓట్ల మెజార్టీ ఇస్తామని వివిధ సంఘాల ప్రతినిధులు తెలిపారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో బుధవారం పాస్టర్లు, ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు, కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ల నియోజకవర్గ స్థాయి సమావేశాలు బుధవారం జరిగాయి. ఆయా సమావేశాల్లో సీఎం కేసీఆర్‌కు మద్దతునిస్తూ ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. ఆయా తీర్మానప్రతులను ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్‌కు ఆయా సంఘాల బాధ్యులు అందజేశారు. కేసీఆర్‌కు లక్ష ఓట్ల మెజార్టీ తగ్గకుండా ప్రతి ఒక్కరం కృషి చేస్తామని ప్రతినబూనారు. గజ్వేల్ రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. వచ్చే ఐదేండ్లలో పరిశ్రమల ఏర్పాటుకు కేసీఆర్ కృషి చేస్తారని తెలిపారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు కృషితోనే నేడు గజ్వేల్‌కు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు వచ్చిందని చెప్పారు. ఆయా సమావేశాల్లో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవీ రవీందర్, ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పంగ మల్లేశం, కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ సంఘం బాధ్యులు దేవదాసు, వెంకటేశ్వర్లు, రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి కాంగ్రెస్‌కు షాక్

- కీలక నాయకుల మూకుమ్మడి రాజీనామాలు
- పార్టీని రేవంత్ జేబు సంస్థగా మార్చుకున్నాడు
- రాహుల్‌గాంధీ మాటలు పూర్తిగా పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రాసిచ్చిన స్క్రిప్టే
- రేవంత్‌పై కాంగ్రెస్ జడ్పీటీసీ, మాజీ ఎంపీపీల ఆగ్రహం
- రాహుల్‌గాంధీ పర్యటనకు ముందురోజే అనూహ్య మలుపు

పెద్దపల్లి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీకి మూకుమ్మడి రాజీనామాలను సమర్పిస్తున్న మాజీ ఎంపీపీలు సత్యనారాయణరెడ్డి, వేముల రామ్మూర్తి, ఓదెల జడ్పీటీసీ సభ్యుడు గంటా రాములు

పెద్దపల్లి, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పార్టీని తన జేబు సంస్థగా మార్చుకున్నారని టీపీసీసీ స్ట్రాటజిక్ కమిటీ సభ్యుడు, ఓదెల జడ్పీటీసీ గంటా రాములుయాదవ్, మాజీ ఎంపీపీ, సీనియర్ కాంగ్రెస్ నేత సీ సత్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ వేముల రామ్మూర్తి, సీనియర్ నాయకుడు హజీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌లో రేవంత్‌రెడ్డి బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని, అవమానించి, ఆత్మాభిమానాన్ని చంపి పార్టీ నుంచి బయటికి పంపే కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. బుధవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్‌కే గార్డెన్స్‌లో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలుచేస్తూ వారితోపాటు మరో 20 మంది కాంగ్రెస్ పార్టీకి మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి తమ బాధలు చెప్పే అవకాశం కూడా లేదని వాపోయారు. తమకు జరుగుతున్న అన్యాయాన్ని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబుకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ సర్వేలన్నీ రేవంత్‌రెడ్డి తనకు అనుకూలంగా మార్చుకొంటున్నారని విమర్శించారు. సీనియర్లను, సిట్టింగ్ ఎమ్మెల్యేలను కలుపుకొని పోకుండా ఒక పర్సనల్ ఎజెండాతో వచ్చి ఆయన పార్టీని సర్వనాశనం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎవరైతే టికెట్ రేసులో ఉంటారో అలాంటి వారిని రేవంత్‌రెడ్డి పక్కకు తప్పించడం, తన వారికి అనుకూలంగా రిపోర్టులు తెప్పించుకొని డబ్బులు ఉన్న వారికే టికెట్లు ఇవ్వడం చేస్తున్నారని దుయ్యబట్టారు.

అవమానం జరిగిన చోట ఉండం

ఆత్మాభిమానం లేని చోట, అవమానం జరిగిన చోట తాము ఉండబోమని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి మద్దతుతో పెద్దపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి విజయరమణారావు విర్రవీగుతున్నారని విమర్శించారు. పెద్దపదల్లి జిల్లాలో రాహుల్‌గాంధీ పర్యటించినా ఒరిగేదేమీ లేదని, రాహుల్ మాట్లాడేదంతా రేవంత్‌రెడ్డి రాసిచ్చిన స్క్రిప్టేనని పేర్కొన్నారు. ప్రజల ఆమోదంతో ఎదుగుతున్న తమపై కుట్రలు, కుతంత్రాలకు దిగుతున్నారని విమర్శించారు. తాము, కాంగ్రెస్ పార్టీలో ఉన్న మరికొంత మందిని కలుపుకొని త్వరలోనే భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామని చెప్పారు. మంథని, పెద్దపల్లి నియోజకవర్గాల్లో గురువారం రాహుల్‌గాంధీ పర్యటిస్తున్న నేపథ్యంలో పార్టీ సీనియర్ నాయకులంతా ఏకంగా రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేస్తూ మూకుమ్మడి రాజీనామాలు చేయడం పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీలో కలకలం రేపింది.

వర్షకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	38.0°c	19.9°c
రంగారెడ్డి	37.0°c	16.6°c
మెదక్	35.0°c	17.8°c
నిజామాబాద్	34.4 °c	23.4°c
ఖమ్మం	34.0°c	24.0°c
వరంగల్	34.0°c	22.0°c
హైదరాబాద్	33.4°c	20.7°c
నల్లగొండ	33.5°c	23.0°c
కరీంనగర్	33.0°c	22.0°c
మహబూబ్‌నగర్	32.5°c	23.4°c

నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

షార్‌లో..

శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (ఎస్‌డీఎస్‌సీ-షార్) కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

- **మొత్తం ఖాళీలు:** 10
- **పోస్టులు:** సైంటిస్ట్ ఇంజినీర్
- **విభాగాలు:** పాలిమర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్/ రబ్బర్ టెక్నాలజీ, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, ఎమ్మెస్సీ అగ్రికల్చర్ (హార్టికల్చర్/ ఫారెస్ట్రీ)
- **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, ఎంఈ, ఎంటెక్, ఎమ్మెస్సీ ఉత్తీర్ణత
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **ఎంపిక:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
- **చివరితేదీ:** నవంబర్ 3
- **వెబ్‌సైట్:** https://apps.shar.gov.in/

ఐఐటీ ఢిల్లీలో..

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఢిల్లీలో స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ కింద అర్హులైన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ-ఎన్‌సీఎల్, పీడబ్ల్యూబీడీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీ అభ్యర్థుల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **మొత్తం ఖాళీలు:** 25
- **పోస్టులు:** అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-1, 2
- **విభాగాలు:** అప్లైడ్ మెకానిక్స్, ఫిజిక్స్, బయోకెమికల్ ఇంజినీరింగ్ అండ్ బయోటెక్నాలజీ, టెక్స్‌టైల్ అండ్ ఫైబర్ ఇంజినీరింగ్ తదితరాలు
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టులో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** మెరిట్, అనుభవం, ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** డిసెంబర్ 15
- **వెబ్‌సైట్:** https://home.iitd.ac.in/jobs-iitd/index.php

ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- పాలిటీ, జాగ్రఫీ, కరెంట్ అఫైర్స్ మెటీరియల్ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

- ధనలక్ష్మీ అలంకారంలో అమ్మవారు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని సీతారామచంద్రస్వామివారి దేవస్థానంలో ధనలక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న లక్ష్మీ తాయారు అమ్మవారు

బీఆర్ఎస్‌కు సబ్బండ వర్ణాల మద్దతు

స్పీకర్ పోచారం వెంటే కుల సంఘాలు

బాన్సువాడ, అక్టోబర్ 18: కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డికి పలు కుల సంఘాలు మద్దతు ప్రకటించాయి. బుధవారం నిజామాబాద్ జిల్లా చందూర్ మండల కేంద్రంలోని కమ్మ సంఘానికి చెందిన 70 కుటుంబాలు, 50 నాయీబ్రాహ్మణ కుటుంబాలు స్పీకర్‌కు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేశాయి. ఈ మేరకు బాన్సువాడలో స్పీకర్‌ను కలిసి తీర్మాన కాపీని అందజేశాయి.

మంత్రి ఇంద్రకరణ్‌కు సొంతూరు అండ

నిర్మల్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సొంత గ్రామమైన ఎల్లపెల్లిలో బుధవారం ఆ గ్రామస్తులంతా కారు గుర్తుకే ఓటు వేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఇంద్రకరణ్‌రెడ్డి ఎల్లపెల్లి నుంచే తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ముందుగా గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో కుటుంబసభ్యులతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. గ్రామపెద్దలు చేసిన ఈ తీర్మాన్ని సమావేశానికి హాజరైన గ్రామస్థులంతా చప్పట్లతో ఆమోదించారు. రాబోయే ఎన్నికల్లో తమ గ్రామంతోపాటు చుట్టు పక్కల గ్రామాల్లో కూడా బీఆర్ఎస్ తరపున ప్రచారం చేస్తామంటూ తెలిపారు.

బాన్సువాడలో స్పీకర్‌కు ఏకగ్రీవ తీర్మాన కాపీని అందజేస్తున్న కమ్మ సంఘం సభ్యులు

విప్ బాల్క సుమన్‌కే గొడన్నల జై

మందమర్రి రూరల్, అక్టోబర్ 18: మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం ఆదిల్‌పేట్‌లో ఎంపీపీ గుర్రం మంగాశ్రీనివాసగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం మందమర్రి మండల స్థాయి గౌడ కుల సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వచ్చే ఎన్నికల్లో చెన్నూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, విప్ బాల్క సుమన్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ఏకగ్రీవ తీర్మానం చేశారు. అంతకుముందు విప్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. జడ్పీటీసీ వేల్పుల రవి, కో-ఆప్షన్ మెంబర్ ననీరొద్దీన్, గౌడ సంఘం నాయకులు పోషగౌడ్, సుధాకర్‌గౌడ్, శంకర్‌గౌడ్, లింగాగౌడ్, తిరుపతిగౌడ్, సత్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సోదాల్లో 165 కోట్లు స్వాధీనం!

- భారీగా పట్టుబడుతున్న నగదు, మద్యం డ్రగ్స్, ఆభరణాలు, ఇతర వస్తుసామగ్రి
- అక్రమాలకు చెక్ పెడుతున్న ఎన్నికల సంఘం
- 2018 ఎన్నికల కంటే మించిన వైనం

బుధవారం నాటికి పట్టుబడిన డబ్బు, మద్యం, డ్రగ్స్ ఇతరాల విలువ

నగదు	రూ.77,87,87,934
మద్యం	రూ.8,99,74,521 (నల్లబెల్లం, ఆలం సహా)
మత్తు పదార్థాలు	రూ.7,55,98,555 (2320 కిలోల గంజాయి)
బంగారం, వెండి, వజ్రాలు	రూ.62,73,18,877
ఇతర సామగ్రి	రూ.8,64,24,812
మొత్తం	రూ.165,81,04,699

హైదరాబాద్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికలకు నవంబర్ 3న నోటిఫికేషన్ రానున్నది. ఈ నెల 9 నుంచే ఎన్నికల కోడ్ అమలవుతుండగా, రాష్ట్రవ్యాప్తంగా భారీగా నగదు, మద్యం, డ్రగ్స్, బంగారం, వెండి, వజ్రాల ఆభరణాలు, ఓటర్లను ప్రభావితం చేసే ఇతర విలువైన వస్తువులు పట్టుబడుతున్నాయి. 2018 ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత వచ్చిన గణాంకాల ప్రకారం పట్టుబడిన నగదు, మద్యం, ఇతర సామగ్రి విలువ సుమారు రూ.137 కోట్లు మాత్రమే. కానీ, తాజా ఎన్నికల సమయంలో కనీసం నోటిఫికేషన్ కూడా రాకుండానే బుధవారం నాటికి పట్టుకున్న మొత్తం విలువ రూ.165.81 కోట్లు. అంటే ఎన్నికల వేళ ఏ స్థాయిలో డబ్బు, మద్యం, డ్రగ్స్, తాయిలాలను రాజకీయ పార్టీలు, నాయకులు, అభ్యర్థులు ఓటర్లకు ఎరగా వేసేందుకు సిద్ధమవుతున్నారో అర్థం చేసుకోవచ్చు. దీనితో పోలీసులు కూడా అదేస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తుండటంతో భారీగా పట్టుబడుతున్నాయి.

కాంగ్రెస్ కౌన్సిలర్ ఇంట్లో 59 చీరల సీజ్

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని 3వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్, మున్సిపల్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఎస్‌కే అబ్దుల్ మజాద్ ఇంట్లో ఎలక్షన్ స్క్వాడ్ మధుకర్ పోలీసులతో కలిసి బుధవారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. ఆయన ఇంట్లో నిల్వ ఉంచిన 59 చీరలను స్వాధీనం చేసుకున్నారు. వాటిని పట్టణ ఎస్సై రాజేందర్, సిబ్బంది సీజ్ చేశారు. - గర్మిళ్ల

అనుమతుల పేరిట 5 లక్షలు డిమాండ్

ఏసీబీకి చిక్కిన కందుకూరు ఎంపీవో, కార్యదర్శి

కందుకూరు, అక్టోబర్ 18 : రంగారెడ్డి జిల్లా కందుకూరు ఎంపీవో కల్యాణి ఆదేశాల మేరకు రూ.2.5 లక్షలు లంచం తీసుకుంటుండగా పంచాయతీ కార్యదర్శి నరేందర్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ భద్రయ్య వివరాల ప్రకారం.. హైదరాబాద్, కొంపల్లికి చెందిన ఎన్ మధుసూదన్‌రెడ్డి రాచులూరు గ్రామ సమీపంలో సిమెంట్ ఇటుకల పరిశ్రమ పెట్టాడు. పరిశ్రమకు అనుమతులు లేవని, ఆ అనుమతులు ఇవ్వడానికి ఎంపీవో కల్యాణి, రాచులూరు పంచాయతీ కార్యదర్శి నరేందర్ రూ.5 లక్షలు డిమాండ్ చేశారు. తన వద్ద అంత డబ్బు లేదని మధుసూదన్‌రెడ్డి చెప్పగా, చివరగా రూ.2.5 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో బాధితుడు 11న ఏసీబీని ఆశ్రయించాడు. అధికారుల సూచన మేరకు మధుసూదన్ బుధవారం తన పరిశ్రమ వద్ద కార్యదర్శి నరేందర్‌కు 2.5 లక్షలు ఇస్తుండగా, ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. రాచులూరు పంచాయతీ కార్యాలయంలో నరేందర్‌తో పాటు కల్యాణిని అధికారులు విచారించారు. విచారణ అనంతరం వారిని రిమాండ్‌కు తరలిస్తామని డీస్పీ భద్రయ్య తెలిపారు.